# సౌందర్యోపాసన

## 1

నాఁటి కింకను క్షత్త్రియరాజ్య మంతరింపలేదు. బౌద్ధ ధర్మ మింకను తలుగుఁదలలో లేదు.

లేక లేక కలిగిన విజయవర్మచే అకలంకదేవుఁడు రాజ్యా నందము మఱచెను.

విజయవర్మ పదుగురు కొడుకులపెట్టు. చిలిపిచేఁతలలో నతనికి కార్తవీర్యునికి వలె వేయి చేతులు కల వనిపించును. అతఁడు చదువుచో చతుర్ముఖుఁడు. పాడుచో గంధర్వుఁడు. గుఱ్ఱ మెక్కెనా కిన్నరుఁడు.

అకలంకదేవున కతఁ డవతరించిన యానందము. అకలంక దేవుఁ డాయానందమును హృదయగుహలో దాఁచికొనును. పట్టమహిషి జయయు దాని గనుఁగొనఁజాలదు.

విజయవర్మకు కొండమీఁది కోఁటి సిద్ధము. అతని మేడ ఒకప్రదర్శనశాల. దాని కతఁ డొకఁడే ద్రష్ట.

అతని యుద్యానమున మల్లెతీవలు గులాబిపూలు పూచును. నిమ్మచెట్లు దబ్బకాయలు కాచును. చైతన్య మన్ని పదార్థములకు గనియా?

అతఁడు పూఁదోఁటలోని మొగ్గలఁ దెచ్చి ఊఁది వికసింపఁజేయఁజూచును. అవి కోపము గొనినటులు మఱికొంచె మెక్కువ ముకుళించుకొనిపోవఁగా నతఁడు విచారముతో వానినిఁ గనుచుఁ గూరుచుండును.

సముద్రతీరమున నతఁడు ప్రో గొనరించిన గుల్లలతో నొక మేడ కట్టవచ్చును. దాన నతనికి న త్తలదొర యని పేరు వచ్చెను.

విజయవర్మకు వలువ లనినఁ గడు మక్కువ. అతఁడు నిన్నఁ గొన్న వస్త్రములు నూఱు, నేఁ డేనూఱు.

చక్కని వస్తువు కానవచ్చినచో నతనికిఁ దక్కక వీలు లేదు. రాజులు నూతనప్రియులు కదా. నూతనత్వమున సౌందర్యము గర్భితము కాఁబోలు.

విజయవర్మ కీడు వచ్చెను. 'గురుకులమున కేఁగఁదగిన తఱి' యని పురోధ నిర్ణయించెను.

అకలంకదేవుఁడు జయను బిలిచి 'కుర్రని గురుకులమునకుఁ బంపవలె నని ఒజ్జల యాన. అతఁడు కొంత కాలము దూరమున నున్నను ఉపార్జించు విజ్ఞానముచేతనే మన కత్యంతము సన్నిహితుఁ డగును' అనెను.

'ఔరా తమకెంత ప్రేమ లేదో. ఈయేడు దాఁటనిం డని అనలేక పోయితిరా?' అని జయ యనెను.

ఈసంభాషణము దాసికలగుండ పురోహితునకుఁ దెలిసెను. దాసికల వార్తలకు వాదర యున్నది.

పురోధ చేతులు కట్టుకొని యెదుట నిలువఁబడి 'మహారాజా ! కుమారదేవున కింకను ఈ డే మంత ముదురలేదు. పై యేడు చాల మంచిదని మనవిచేసెను.

తేని పెదవులపై మెఱుపు మెఱసెను.

## 2

విజయవర్మ అంచఱమాటలు వినెను. ఒకనాఁటి తెలవాఱుజామున ఎవరికిఁ దెలియకుండ ఆచార్యునికడ కేఁగి 'అభివాదయే విజయవర్మాహమ్' అని నమస్కరించెను. ఆచార్యుఁడాశ్చర్యపడి 'ఆయుష్మా నేధి విజయవర్మన్' అని ఆశీర్వదించెను.

'ఏమీ వింత? రోగ మభినయింపకయు దాసీగృహముల దాఁగుకొనకయు దేశాంతరము పాఱిపోవకయు నేరాచబిడ్డఁడు గురుకులమునఁ బ్రవేశించెను?' అని ఆచార్యు లాశ్చర్యపడిరి.

తలిదండ్రు లావార్త విని క్రమక్రమముగా దుఃఖముఁ బాసి సంతసించిరి. గురుకులమునకుఁ దగు కానుక లంపిరి.

ఆశ్రమమునం దవలంబింపవలసిన నియమములను ఉపాచార్యుఁడు విజయవర్మకు బోధించెను.

విజయవర్మ సులభముగనే మాంసము వర్జించెను. హాయ

వ్యసనము జయించెను. దాసీసేవయు మఱచెను. తల్లి బెంగ పోఁగొట్టుకొనెను. లీలాఖేలలు మానెను.

విద్యార్థు లందఱకును విజయవర్మపై నిపుడు గుర్రు. ఉపాచార్యునిచిత్తాలో నతని దోసఁ గొకటియు లేదు.

ముందర గురువుపాఠము చూచుకొనవలెను. పిదప విజయవర్మకు పాఠము చెప్పవలెను.

గురుకులమునకు వచ్చి విజయవర్మను చూచిపోయిన బంట్లుకలంకదేవునికడ కరిగి ‘మహారాజా! కుమారదేవునివలన గురుకులము గురుకులముతీరుగా నున్న’ దని మనవి చేసిరి.

గురుకులమునుండి వచ్చిన దాసికలు ‘మహాదేవీ! రాచకొడుకు రాచకొడుకే. మీరు పంపిన భక్ష్యములు మూచూడ నయిన మూచూడలేదు. ఖాద్యముకన్న విద్యయే వారికి స్వాద్యముగా నున్నది. నత్తలబాబు చదువులబాబయిపోయె’ నని జయయెదుట మనవిచేసిరి.

3

విద్య చాల సుందరమయిన దయియుండవలెను. కానిచో రాజకుమారుఁ డంత తత్పరుఁ డగునా?

వస్తువునందలి యందమును జూచి యానందించుట కొందఱి ప్రకృతి. అందమగు వస్తువును త్యాగము గావించి యానం

దించు టం కొందఱ ప్రకృతి. అందమగు వస్తువు నుపభోగించుట మఱికొందఱ ప్రకృతి.

విచ్చిన పూవునందు భగవంతుని జూచి యానందించువా రొకరు. దానిని గోసి తెచ్చి భగవంతుని బూజించి యానందించు వా రింకొకరు. దానిని ద్రుంచి తుఱుమునఁ దుఱుముకొని యానందించువారు మఱియొకరు.

సుందరమగు వస్తువునం దభిలాషములేనివాఁ డెవఁడు? మహాసుందరమగు నొకపరమవస్తువుదెసకే యీజగమంతయుఁ బరువిడుచున్నది.

విజయవర్మ మేడలో నత్తగుల్ల మొదలుకొని నవమాణిక్య ములవఱకును గలవు. ఇపు డిచట రక్కెసపూవు మొదలుకొని రాతిపూవువఱకును గలవు.

ఒకనాఁ డాతఁడు గరడిసాలకుఁ జనెను. గోడపై కత్తి భీషణమగు సౌందర్యములో నోలాడుచు వ్రేలాడుచుండెను. అతఁడు దానిని జూచి చూచి చిత్రశాలకుఁ జనెను. అచట నొక విరహిణి యతని మానసమును హరించెను. అట నుండి యుండి యతఁడు వస్తుశాల కరిగెను. అచట నొక బంగారు నాణె మతని మదిని నాఁచికొనెను.

మఱియొకనాఁ డతఁడు వ్రాయసకాఁడు సుషేణుని కుటీరమున కరిగెను. తలుపులు తెఱచియే యుండెనుగాని యచట నెవరును లేరు.

ఎదురుగా పోకపొత్తి పట్టుబట్టవలె మెఱసిపోవుచుండెను. తాటాకులు వెండిరేకులవలె దగదగలాడుచుండెను. గంటము వానిప్రక్క నిగనిగలాడుచుండెను.

అతఁడు బయటికివచ్చి నలుమూలలు పరికించెను. ప్రకృతియు పరిసరమునుగూడ నేకవిధమగు సౌందర్యబోధ యొనర్చెను.

4

విద్యార్థులలో కలవరము విశేషించెను. 'నే నాచార్యదేవుల కర్పింపఁదలఁచి జందెములు కడు సన్నగా వడకి సెనగకాయలో నమర్చి దాఁచికొంటిని. ఎవఁడో హరించె' నని యొక విద్యార్థి అందఱ మెడలును పరీక్షింపఁబోడఁగెను.

మఱియొకని వస్త్రము మాయమాయెను. అతఁ డెవరికిని జెప్ప కయే యర్ధరాత్రమున నందఱిమూటలు విప్పి పరీక్షించుచుండెను.; మఱియొకఁడు లేచి దొంగ దొంగ యని కేకలువైచెను. అంద ఱాతని లంకించుకొనిరి.

అచార్యులలోఁగూడఁ గలవరము కలుగక మానలేదు. ఉపాచార్యుని భక్తిసూత్రము లూరేఁగెను. అనాఁ డందఱికి ననధ్యయనమహోత్సవము.

ఎవరికిని పెట్టె లేదు. ఎవరికడను ఏ వస్తువును గానరాదు. కావున వా రెల్లరు నా యభావసింహాసనముమీఁదనొక దయ్యము నభిషేకించిరి.

'నేను నడికిరేయి వెలికి వచ్చితిని. ఒక దయ్యము మీ కుటీరము దాపుగా రివ్వునఁ బరువెత్తెను. మీకుఁ గానిపింప లేదా?' అని ఒకఁడు విజయవర్మ నడిగెను. ఆరాత్రియే నయగుప్తుని భూర్జపత్రములు పోయెను.

ఇటు లా దయ్యము గురుకులమును నిరంకుశముగా పరిపాలించుచుండెను.

అనధ్యయనములలో విద్యార్థు లందఱును మఱ్ఱినీడలలో నచట నచట గుంపులుగుంపులుగాఁ గూరుచుండిరి.

'దయ్య మేమిటిరా? నీమొగము. దేవశర్మరా యీ దొంగ' అని ఒకఁ డనెను.

'కాదు కాదు నయగుప్తుఁ డెల్లప్పుడును మూటలు సద్దుకొనుచుఁ గూరుచుండును. ఇది వానిపనిగాని మఱియొకని పనికా' దని ఒకఁ డనెను.

'ఎబ్బె వాఁ డసలే కోమటి. అందును దయ్యపుభయము. రేల నిదుర లేదు. పర్యంకాసనము. ఎందుల కని? అది తన్నెత్తుకొనిపోవునేమో' యని. ఇంకొకఁ డనెను.

'చా చా వాఁడు కాదురా. ప్రతికుటీరము పనిలేకయే దేవదాసు తెగ తిరుగును. ఇది తప్పక వాని పనిరా' యని యింకొకఁ డనెను.

విజయవర్మ యిది యంతయు విని 'మీకు వ్యాప్తి యన

నేమియో యింతవఱకును తిన్నగా తెలియలేదు. డబ్బొకచోట అనుమాన మింకొక చోట' అని తీరుపు చెప్పెను.

౫

సౌందర్యబోధమునం దిపు డొక భయకీటము ప్రవేశించి విజయవర్మను 'దొంగతన మన నేమి?' అని ఝుంకరించుచుండెను.

'మనుజుఁడు తనకుఁ గావలసినవస్తువును దీసికొనుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. అడవిలోని పండ్ల నందఱును దీసికొనిపోవుచున్నారు. ఆ యడవి ఒక రాజుదయినచో నెవరు తీసికొనినను దొంగ లగుచున్నారు.

'ఒక రాజును జయించి మఱియొకరాజు వానిభూమి నంతయుఁ గలుపుకొనుచున్నాఁడు. అది పరాక్రమము.

'పొలఁతిని పురుషుఁడును పురుషుని పొలఁతియుఁ బరస్పర మాకర్షించి అపహరించుకొనుచున్నారు. అది ప్రేమ.

'ప్రతినిమిషమును ప్రతివాఁడును పంచభూతములను అపహరించుచునే యున్నారు. ఇది దైవవర్ణము.

'పట్టుపడనిచో రాజు, పడినచో దొంగ.

'జగత్తంతయు దొంగలకొట్టు.'

ఇటు లనుకొనుచు విజయవర్మ సర్వాసముఁ డను శ్రమణునితోఁ జదువ నరిగెను. శిష్యు లందఱు పులు గడిగిన ముత్తె

ములవలెఁ గూరుచుండిరి. సర్వసముఁడు ధర్మాధ్యాపకుఁడే కాక అర్థశాస్త్రోపాధ్యాయుఁడు. సర్వసముని ప్రపచన మాయెను. పిదప అర్థశాస్త్రమునందలి ఒక యంశమునుగుఱించి యీక్రింది ప్రశ్నోత్తరము లారంభమాయెను.

'అయ్యా దొంగతన మన నేమి?'

'ఒకనివస్తువును మఱియొకఁడు వాని యనుమతిలేక తన దిగాఁ జేసికొనుట దొంగతనము. ఇది సామాన్యలక్షణము.'

'వస్తు వొకని దెటు లగును?' అని విజయవర్మ అడిగెను.

'ఈ బట్ట నేను నేసికొంటిని. ఇది నాది.'

'దీనిని దేనితో నేసితిరి?'

'ప్రత్తినూలితో.'

'ప్రత్తి యేడది?'

'ప్రత్తిమొక్కనుండి వచ్చినది.'

'ప్రత్తిమొక్క?'

'భూమినుండి.'

'భూమి ఎవరిది?'

'ఱేనిది.'

'ఱేని దెటు లాయెను?'

'ఱేఁడు జయించెను.'

'దేనిచే?'

'సైనికుల శక్తిచే, తన పరాక్రమముచే.'

'అగుచో నేఁడు దొంగ కాఁడా ?'

ఈప్రశ్నకు సర్వసముఁడు సమాధానము చెప్పులోపల శిష్యసముద్రమున నొకహాస్యతరంగము నిట్టవొడిచెను. జాగరూకమయిన విజయవర్మ సౌందర్యబోధ మాధిగ్రస్తమాయెను.

సర్వసముఁ డిటు లనెను. 'దొంగ కాఁ డని యెవ రందురు ? కాని మిగిలిన దొంగలవిప్లవమునుండి లోకులఁ గాపాడుట కీ గజదొంగ కావలయును. అది అన్యథా సిద్ధ మగుచో నీ'దొంగ'తో నంతగా పని లేదు.'

విజయవర్మమనస్సు కలుక్కు మనెను. అతఁడు తలయెత్తి అస్తమించుచున్న యినబింబమును చూచెను.

౬

'దేవశర్మకు నయగుప్తునకు దేవదాసునకు పాఠము నిషిద్ధము. ఈ యాజ్ఞ తమగుండ నెఱవేర్పఁబడవలయునని ఉపాచార్యుల యాదేశము' అని శ్రుతవర్మ విజయవర్మకుఁ జెప్పెను.

విజయవర్మ కనుఁగొలఁకులలో నీరు వెలువడెను. 'తేపకడ విజయవర్మకుటీరమున దొంగ యుండు నని ఉపాచార్యులకడ నా ప్రతినగా మనవిచేయు మ'ని విజయవర్మ చెప్పి శ్రుతవర్మకుఁ గౌతుకము కలిగించెను.

తన నొకభూత మావేశించినటులు విజయవర్మ తిరుగాడెను. పవలు తనను విచారించు అధికరణకమో యన నుండెను.

చంద్రుఁడు దొంగవలె కొంచెము కొంచెము మోమెత్తఁ దొడఁగెను. నీరవ మగు నా యేకాంతమున వెన్నెల వెర్రిదయ్యము వలె నుండెను.

అతఁడు నిదురలో నొక స్వప్నప్రపంచమును గనుఁగొనెను. ఆ ప్రపంచ మంతయుఁ ధనసౌరంగము. దానినుండి గావంచా లేచి నిలువఁబడి 'నన్ను బాలాకి యనువాఁడు రాట మునఁ బెట్టి సన్నని దారముగాఁ దీసెను. తరువాత కొల్లాయ యను మాలనిమగ్గమునఁబడి సుందరమగు స్థూలదేహమును సంపాదించుకొంటిని. బాలాకి నా ముఱికి పోఁగొట్టి గన్నేరు రంగు పట్టించి పూవువలె నన్ను వాడుకొనుచుండెను. నేను జలకమాడి దణ్ణెముమీఁద నిదిరించుచుండఁగా నీ వపహరించితివి. నాకు వెలుఁగులేదు. గాలిలేదు. ఎలుకలు నా డొక్కలు కొట్టివైచెను. నేను కొంత మట్టిపాలయితిని. ఇపుడు సూక్ష్మశరీరమే మిగిలియున్నది.' అని చెప్పుచుండఁగా తాళపత్రమొకటి లేచి నిలువఁబడి 'నీవు నీ క్షోభమాత్రమే చెప్పుకొనుచున్నావు. నీవు మాకందఱకుఁ బ్రతినిధివి కావు. ఇఁక నీ వాఁగుము. ఓ రాజకుమారుఁడా! నీవు మొదట నన్నును, పోకపొత్తిని, మా రేడుబుర్రను ఎత్తుకొనివచ్చితివి. పిదపఁ గొని వచ్చిన వస్తువులతో మా కుక్కిరిబిక్కిరిగా నున్నది.' అని చెప్పుచుండఁగా సటఁ గలవస్తువులన్నియు బయటికి వచ్చెను. పోకపొత్తి కలకల నవ్వెను. ఉద్ధారిణి పంచపాత్రమునఁ దిరిగి గణగణమని మ్రోఁగెను. భక్తిసూత్రములు పైకివచ్చి నీకు చదువు

రా డనెను. పిదప గంటము వాని నన్నిఁటిని గడకుఁ ద్రోసి అతనికంఠముకడకువచ్చి నన్నె ఱుఁగుదువా? మమ్ము మా యజమానుల కప్పగింపకున్న నొకపోటు పొడిచెద నని బాణము వలె బయలుదేఱెను. పిదప ఉపాచార్యుఁ డొక ముసుఁగు కప్పుకొని వచ్చి తొంగిచూచెను.

అంతట నా స్వప్న ప్రపంచము విలయమాయెను. రావిచెట్లపై కాకులు కా కా యనెను. విజయవర్మ ఉలికిపడి లేచెను.

౭

సూర్యుఁ డుదయించెను. శిష్యులందఱును స్నానానులిప్తులై వార్చి వందన మొనరించిరి.

విద్యార్థు లొకరొకరే విజయవర్మకుటీరముముందు గుమిగూడఁ దొడఁగిరి.

మెలమెలగా నడచివచ్చుచున్న నయగుప్తుని జూచి బాలాకి 'నీవే విజయవర్మకుటీరముముందు చేతులు కట్టుకొని నిలువఁబడియుందు వనుకొంటినే' అని అనెను.

'నేనును అటులే అనుకొని రేయెల్లయు గుంజకు మెడ నంటఁగట్టించుకొంటి' నని నయగుప్తుఁ డనెను.

'ఓహో దేవశర్మ !! నిన్ను విజయవర్మ కుటీరములోఁ జూతు ననుకొంటినే? ఇది యేమి మహానుభావా?'

'ఇపు డేమి మిగిలిపోయెను ?'

ఇంతలో దేవదా సచటికి వచ్చెను.

'ఓహో అంతయు తాఱుమాఱుగా నున్నదే' అని బాలాకి దేవదాసును దేవశర్మ నయగుప్తులనడిమికి తోసెను.

అంతలో కులపతియు ఉపాచార్యుఁడును ఉపాధ్యాయులును మిగులు హేమాహేమీలును ఘటాఘటీలును కలిసి వచ్చుచుండిరి.

విజయవర్మ కుటీరము మూసియుండెను. ఆచార్యులును శిష్యులును ఆ కుటీరముముందు నిలువఁబడిరి.

విజయవర్మ కుటీరద్వారము తెఱచెను. అందఱును తొంగితొంగి చూడఁదొడఁగిరి. లోపల లోటారము.

విజయవర్మ అందఱకును స్వాగతముచెప్పి లోపల కూర్చుండఁబెట్టెను.

'దొంగ ఏఁడి?' అని ఉపాచార్యుఁ డడిగెను.

'ఈప్రపంచమున దొరకన్న వేఱదొంగ యెవఁడు?' అని విజయవర్మ నిటారుగా నిలువఁబడి 'అయ్యా నేనే దొంగను.' అని అందఱకును నమస్కరించెను.

అందఱును తెల్లఁబోయిరి.

అంత విజయవర్మ తన సొరంగమునుండి ఒకొకవస్తువునే

వెలకిఁదీసి—'అయ్యా! ఈద్రోంగకు శిక్ష?' అని తనకు శిక్ష కోరు కొనెను.

'యావద్రాజ్యమున బంధించుటయె నీకు శిక్ష' అని కులపతి అనెను.

సర్వసముద్రము శిష్యసముదాయమును ఆచార్యవర్గమును గలిసి ఒక్కపెట్ట తథాస్తు అని అనెను.

విజయవర్మ కపుడు సౌందర్యబోధ కలిగెను.